నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 30 జనవరి 2024 | NIZAMABAD

రాజ్యమేలుతున్న మహారాష్ట్ర వ్యాపారులు
కనీస మద్దతు ధర కన్నా తక్కువకే కొనుగోళ్లు
మద్నూర్‌లో ఒక్కటే సీసీఐ కొనుగోలు కేంద్రం
బీజేపీ ఎంపీగా పట్టింపు కరువైన ధర్మపురి అర్వింద్
ఎమ్మెస్పీ రూ.7020గా నిర్ధారించిన కేంద్రం



పత్తి రైతు విలవిల

నిజామాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పత్తి రైతులను దగా చేయడం షరా మామూలుగానే కొనసాగుతున్నది. ఆరుగాలం శ్రమించి పంట పండించిన కర్షకులు నష్టాలను చవి చూడాల్సి వస్తున్నది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) చేపట్టాల్సిన కొనుగోళ్ల ప్రక్రియ తూతూ మంత్రంగా సాగుతుండడంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది. నిజామాబాద్ ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ మాత్రం కనీసం పట్టింపు లేనట్లుగానే వ్యవహరిస్తున్నాడు. నిజామాబాద్, జగిత్యాల ప్రాంతాల్లోని పలు చోట్ల నీటి వసతిని అంచనా వేసి నేల స్వభావం మేరకు పత్తిని సాగు చేస్తున్నారు. వీరంతా పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మద్దతు ధర కన్నా తక్కువకే విక్రయించుకుంటున్నారు. రైతుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు మహారాష్ట్ర నుంచి వ్యాపారులు రంగంలోకి దిగి ఎమ్మెస్పీ కన్నా తక్కువకే కొనుగోలు చేసి డబుల్ ఆదాయం ఆర్జిస్తున్నారు. పత్తి కొనుగోలు చేసే పక్క రాష్ట్రం వ్యాపారులంతా బీజేపీకి చెందిన వారేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

మద్నూర్‌లోనే సీసీఐ కేంద్రం..

పత్తిని సేకరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాదే. పత్తి సాగును అంచనా వేసి వారికి నష్టం వాటిల్లకుండా కేంద్రాలను నెలకొల్పి కనీస మద్దతు ధరతో పత్తిని కొనాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా ప్రతిసారి జుక్కల్ నియోజకవర్గంలోని మహారాష్ట్ర సరిహద్దు మద్నూర్‌లోనే సీసీఐ కొనుగోలు కేంద్రం తూతూ మంత్రం గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా సీసీఐ అధికారుల మాయాజాలంతో కనీస మద్దతు ధర అన్నదే రైతులకు దక్కడం లేదు. మహారాష్ట్ర వ్యాపారులతో ములాఖత్ కావడం ద్వారా ఎమ్మెస్పీ కన్నా తక్కువకే సేకరిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీసీఐ కొర్రీలు.. రైతులకు నష్టాలు

కొద్దిరోజుల క్రితమే మద్నూర్‌లో నెలకొల్పిన సీసీఐ కొనుగోలు కేంద్రం ఒకట్రెండు రోజుల్లోనే మూసివేతకు సీసీఐ నిర్ణయించింది. వాస్తవానికి కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా పత్తి సాగు అవుతుంది. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పత్తి రైతులకు ఈ కేంద్రం ద్వారా లాభం జరగాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. రవాణా ఖర్చులు భరించుకొని పత్తిని తీసుకెళ్తే తేమ శాతం పేరుతో సీసీఐ వారే కొర్రీలు పెట్టి రైతులను నిలువునా ముంచుతున్నారు. వీరిపై పర్యవేక్షించాల్సిన అధికారులెవ్వరూ లేకపోవడంతో వారిదే పైచేయి అన్నట్లుగా తయారైంది. ఈ విషయమై కలెక్టర్‌కు పలువురు రైతు సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేసినప్పటికీ కామారెడ్డిలో కనీస స్పందన లేకుండా పోయింది. మద్నూర్ సీసీఐ కొనుగోలు కేంద్రంలో 58,596 క్వింటాళ్ల పత్తిని సేకరిస్తే, ప్రైవేటు వ్యాపారులు మాత్రం 1,05,266 క్వింటాళ్లు కొనుగోలు చేశారు.

పట్టించుకోని ఎంపీ.. సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు..

నిజామాబాద్ జిల్లాలోనూ పత్తి పంట సాగవుతున్నది. ఈ ప్రాంతం నుంచి బీజేపీ ఎంపీగా ధర్మపురి అర్వింద్ ఉన్నప్పటికీ ఇసుమంతైనా లాభం జరగడం లేదు. పత్తి రైతుల మేలు కోసం కనీసం సమీక్షలు నిర్వహించకపోవడం విడ్డూరం. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, కేంద్ర పెద్దలతో మాట్లాడి సీసీఐ ద్వారా తాత్కాలిక కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం కూడా అర్వింద్‌లో కనిపించకపోవడం ఈ ప్రాంత రైతుల దురదృష్టంగా మారింది. 2023-24 వానకాలంలో పత్తి పంటకు మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గమే మేలు రకం క్వింటాకు రూ.7020 కనీస మద్దతు ధరను నిర్ణయించింది. కానీ ప్రస్తుతం రైతు వ్యవసాయ క్షేత్రాల్లో రూ.6200లకు అమ్ముకోవాల్సి వస్తున్నది. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమింపబడిన కులాచారి దినేశ్ సొంత నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్, ఇందల్వాయిలో పత్తి పండించిన రైతులది దిక్కుతోచని పరిస్థితి. ఎంపీ పట్టించుకోకపోవడంతో మహారాష్ట్ర వ్యాపారులు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం వెనుక బీజేపీకి చెందిన కీలక వ్యక్తులు ఉంటున్నట్లుగా రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నష్టాలు...

నేను కౌలుకు భూమిని తీసుకొని 50 ఎకరాల్లో పత్తిని సాగు చేశాను. గతంలో ఎన్నడూ లేని విధంగా మొన్న కురిసిన అకాల వానలతో పంట నాశనమైంది. దీనికి తోడుగా చేతికొచ్చిన పత్తి పంటకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన లేకపోవడంతోనే ప్రైవేటు వ్యాపారులకు రూ.6200లకే అమ్ముకోవాల్సి వస్తున్నది.

- పుట్ట వీరయ్య, పత్తి రైతు

పత్తి రైతులను ఆదుకోవాలి...

నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దిగుబడి భారీగా తగ్గిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈసారి మద్దతు ధరను రూ.7020 ప్రకటించింది. కానీ మాకు మాత్రం అంతకు తక్కువే వస్తున్నది. పట్టించుకునే వారు లేకపోవడంతో పత్తి పండించిన మా బతుకులు ఆగమవుతున్నాయి. దయచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

- ధర్మపురి సాయిలు, పత్తి రైతు

పరస్పరం నిప్పంటించుకున్నట్లు అనుమానాలు..
ఓ యువకుడి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

జిల్లాకేంద్రంలో యువకుల మధ్య ఘర్షణ

వినాయక్‌నగర్, జనవరి 29 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి పలువురు యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఓ యువకుడి ప్రాణాలు బలి గొనగా.. మరో యువకుడికి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. నగరంలోని ఖిల్లారోడ్డులో ఉన్న ఓ పాత భవనంలో ఓ యువకుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డితో పాటు అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్ కుమార్, నగర సీఐ నరహరి ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. యువకుడి శరీరానికి నిప్పంటించి దహనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడిని ముఖీత్ (25)గా గుర్తించారు. ఈ ఘటనలో రాత్రి నిప్పంటించిన సంఘటనలో శరీరం కాలిన గాయాలతో షేక్ హైమద్ అనే మరో యువకుడు జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు, క్షతగాత్రుడి మధ్య జరిగిన గొడవలో ఒకరినొకరు కాల్చుకున్నారని పోలీసులు తెలిపారు. వీరి మధ్య గొడవ జరిగిన సమయంలో ఎంత మంది ఉన్నారు, ఘటనకు గల కారణాలు, దీనివెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నామని, ఖిలా రోడ్డు ఏరియాలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కంఠేశ్వర్, జనవరి 29 : జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ గ్రౌండ్‌లో నేడు (మంగళవారం)ఉమ్మడి జిల్లా స్థాయి (అండర్ -17) బాలబాలికలకు వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగీతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9701502241 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కంఠేశ్వర్, జనవరి 29 : జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఆర్మూర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాలలో, బాలికలకు సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, జనవరి 29: అభివృద్ధి పనులు ఆగకుండా త్వరితగతిన పూర్తిచేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బాల్కొండలోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో, డీఎల్పీవో, నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. నియోజకవర్గంలో సుమారు 95వేల దరఖాస్తులు వచ్చాయని, రేషన్‌కార్డుల కోసం 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వివరించారు. రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు కోసం మరో నాలుగు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ధరణి అమలు తీరుపై చర్చించి క్లియర్‌గా ఉన్న టైటిళ్లను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో పెట్టొద్దని సూచించారు. కలెక్టర్, సీసీఎల్ఏలో పరిష్కారానికి తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉపాధి పనులపై అడిగి తెలుసుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

పోడుపట్టాల పంపిణీ

కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామం డీసీ తండా, బిల్యానాయక్ తండాకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు పోడు భూముల పట్టా పాస్‌పుస్తకాలను సోమవారం ఎమ్మెల్యే వేముల అందజేశారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలను అందజేస్తున్న వేముల

ఎంపీ ఎన్నికల్లో సత్తాచాటుదాం

అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరాలి
బీజేపీ, కాంగ్రెస్ పార్టీ దిమ్మతిరగాలి
ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన హస్తం పార్టీ
బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

పిట్లంలో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

పిట్లం, జనవరి 29: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిమ్మతిరిగేలా రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరీ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల సన్నాహక సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నష్టం జరిగిన చోట సరిదిద్దుకునే విధంగా రాష్ట్రమంతటా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. వచ్చే ఏప్రిల్‌లో నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే ఢిల్లీలో తెలంగాణ కోసం పార్లమెంటులో మాట్లాడుతారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిందని, వాటిని అమలుచేయాలంటే ఏడాదికి రూ.1.30 లక్షల కోట్లు అవసరమవుతుందని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలుచేయాలంటే వీటికి రూ. 4 లక్షల కోట్లు ఏడాదికి కావాల్సి ఉందని, ఆలోచన లేకుండా ప్రజలను మభ్యపెట్టి గెలిచారని విమర్శించారు.

మేము ఉంటే ఈపాటికి పెట్టుబడి సాయం వచ్చేది

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఇప్పటికే యాసంగికి పెట్టుబడి సాయం అందించేవారని తెలిపారు. రాష్ట్రంలో కరెంటు కోతలు సైతం మొదలయ్యాయని పేర్కొన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఓటింగ్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి మధ్య 1.80 శాతం మాత్రమే తేడా ఉందని, ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన నియోజకవర్గం జుక్కల్ అని పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని, కార్యకర్తలు ఆందోళన చెందవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే షిండే ప్రతి శాఖ మంత్రి వద్దకు వెళ్లి నిధులు తీసుకువచ్చి జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఇలాంటి నాయకుడు ఓడినప్పటికీ నియోజకవర్గంలోనే ఉంటూ సేవ చేయడం కార్యకర్తల అదృష్టమని పేర్కొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

-మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టి కాపాడుకుంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. నియోజకవర్గంలో 50 ఏండ్లలో జరగని అభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సహకారంతో తొమ్మిదిన్నరేండ్లలో చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ వారు అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. పదేండ్ల క్రితం నియోజకవర్గం ఎలా ఉండేది, తాను అధికారం చేపట్టాక ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలని కోరారు. పూర్తికాని అభివృద్ధి పనులపై ప్రస్తుత ఎమ్మెల్యేను నిలదీయాలని సూచించారు. తాము నిర్మించిన భవనాలకు వారు ప్రారంభోత్సవం చేస్తూ, తామే నిర్మించినట్లు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ముబారక్‌నగర్‌లో దొంగల బీభత్సం

తాళం వేసిన రెండిండ్లలో చోరీ
10 తులాల బంగారం, రూ.1.20 లక్షల అపహరణ

వినాయక్‌నగర్, జనవరి 29 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్‌లో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న రెండిండ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ముబారక్‌నగర్ ప్రాంతంలోని కస్తూరి గార్డెన్ కాలనీలో ఉండే ధనలక్ష్మి తల్లి ఇటీవల మరణించారు. ఆమె ఇంటికి తాళం వేసి కంఠేశ్వర్ ప్రాంతంలో నివాసముంటున్నది. దీంతో ఆమె ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న 5 తులాల బంగారు నగలను చోరీ చేశారు. అనంతరం ముబారక్‌నగర్ ఏరియాలోని రాజగంగు అనే మహిళ ఇంట్లోకి చొరబడిన దొంగలు.. 5 తులాల బంగారు నగలతో పాటు రూ.1.20 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. రెండు చోరీలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డిచ్‌పల్లి వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన ఎంపీటీసీ సభ్యులు

డిచ్‌పల్లి, జనవరి 29: డిచ్‌పల్లి వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావుపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలంలో ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించగా.. మొత్తం 17 మంది ఎంపీటీసీలకు 13 మంది హాజరయ్యారు. ఆర్డీవో బలపరీక్ష నిర్వహించగా.. వైస్ ఎంపీపీ శ్యాంరావుకు వ్యతిరేకంగా 13 మంది ఎంపీటీసీలు చేతులు పైకెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీపీ భూమన్న అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో ఉదయం 10.30 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేశామని తెలిపారు. వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని 11.30 గంటలకు నిర్వహించినట్లు చెప్పారు. మెజార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారని, దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో డిచ్‌పల్లి ఎంపీడీవో టీవీఎస్ గోపీబాబు, ఎంపీటీసీలు చిన్నోల్ల నర్సయ్య, దండుగుల సాయిలు, ఉగ్గెర కృష్ణవేణి, పులి నర్సింగ్‌రావు, చాకటి రాజమణి, కుర్రి సవిత, దుంపాల సౌమ్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పసుపును పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

పసుపు ధర తగ్గిస్తే సహించం

ఎంపీ ధర్మపురి అర్వింద్

వినాయక నగర్, జనవరి 29: ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర ఆశాజనకంగా ఉన్నదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తే సహించబోమని హెచ్చరించారు. సోమవారం ఆయన అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డితో కలిసి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. పసుపు కొనుగోళ్ల పై రైతులు,వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు.నాణ్యమైన పసుపు సాగు దిశగా రైతులు దృష్టి సారించాలని, ఎండిన పసుపును మాత్రమే మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. కొత్త పంటకు 10 శాతం తేమతో ఈ నెల 25 వరకు రూ.10,890 ధర ఉండగా..పాత పసుపునకు రూ.13 వేలు పలికినట్లు తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానున్నదని, మంచి పంట పండిస్తే రానున్న మూడేండ్లలో ధర మూడింతల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎగుమతులు కూడా పెరుగుతాయన్నారు.ఆశించిన ధర వస్తే రైతులు, వ్యాపారులకు లాభాలు వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, కార్పొరేటర్లు, మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లలిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి కమల్ కిశోర్, కోశాధికారి రమేశ్ తదితరులు ఉన్నారు.